క్లుప్తంగా

స్థలం పరిశీలన



మక్తల్: మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం కోసం గుర్తించిన ఐదు ఎకరాల స్థలాన్ని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ చక్రధర్‌గౌడ్ సిబ్బందితో గురువారం పరిశీలించారు. ఇక్కడ భవనం నిర్మించాక 150 పడకలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. అధికారులకు సహకరించాలని స్థానికులను కోరారు.

సైనిక్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక



నర్వ: ఉమ్మడి మండలంలోని మిట్టనంది మల్ల గ్రామానికి చెందిన విద్యార్థి సోహెల్ సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. కరీంనగర్ రుక్మాపూర్ సైనిక్‌స్కూల్ సంబంధించి టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ విడుదల చేసిన ఫలితాల్లో ఉత్తీర్ణుడయ్యాడు. దీంతో విద్యార్థి ఎంపికపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

మురుగు కాలువ నిర్మించాలి



మాగనూర్: మండలంలోని వడ్వాట్‌లో ప్రధాన రహదారులపై మురుగు పారుతోందని దీంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. పంచాయతీ కార్యాలయం నుంచి రైతు వేదిక వరకు సీసీ రోడ్డు పక్కన మురుగు కాలువ లేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఊట్కూరు: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎన్ తిరుపతయ్య ఆధ్వర్యంలో 500 మంది ముస్లింలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, నాయకులు జమీర్‌అలీ, అబ్దుల్‌రహమాన్, జాఫర్, డీలర్ మైమూద్, నాసీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం



మాగనూర్: మండలంలోని మందిపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయం వద ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురువారం సర్పంచ్ అంజమ్మ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఖాయ్యుంపాషా, పంచాయతీ కార్యదర్శి శైలజ, డాక్టర్ శిరీష, వైద్య సిబ్బంది శారద, వేదవతి, డాక్టర్ భానుప్రసాద్, ఆశ కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

పగిలిన పైపులైన్ బాగు చేయండి



ధన్వాడ: మండలంలోని గున్ముక్ల, యంనోనిపల్లి గ్రామ శివారులో కోయిల్‌సాగర్ కాలువ నుంచి వచ్చిన పైపులైన్ పగిలిపోయిందని, కాలువ ద్వారా నీటిని వదిలితే వృథాగా పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాల్వ మధ్యలో చెరువుకు పాటు కాలువ ఉండటంతో దాని నుంచి పైపులైన్ ద్వారా అవతలి వైపు కాల్వకు పైపులైన్ ద్వారా కనెక్షన్ ఇచ్చారు. కొద్ది రోజుల క్రితం పైపులైన్ పగిలిపోవడంతో కాలువలో నీరు వదిలితే పగిలిన పైపులైన్ నుంచి వృథాపోతుందని, అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

ఆర్‌ఓబీ త్వరగా పూర్తి చేయండి

- చిన్న పని కూడా పెండింగ్ పెట్టొద్దని ఆదేశాలు
- పనులను పరిశీలించిన కలెక్టర్ రవినాయక్, ఎమ్మెల్యే ఆల



ఆర్‌ఓబీని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి నాయక్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు

దేవరకద్ర: పట్టణంలోని ఆర్‌ఓబీకి సంబంధించిన అన్ని పనులు నెలాఖరులోగా పూర్తి కావాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. గురువారం కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పనులను పరిశీలించారు. సంత బజార్ నుంచి ప్రారంభమైన ఆర్‌ఓబీకి పైకి కలెక్టర్, ఎమ్మెల్యేలు నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. రెండు వైపుల సర్వీసు రోడ్లు, పిల్లర్ల మధ్య గోడలు, మొక్కలు నాటడం, యూటర్న్‌లను ఏర్పాటు చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న పని కూడా పెండింగ్‌లో ఉండరాదని సూచించారు.

కేంద్రం నిధులు ఇవ్వలేదు: ఎమ్మెల్యే

దేవరకద్ర ఆర్‌ఓబీకి కేంద్ర ప్రభుత్వం నిర్మించాలి. మూడేళ్ల పాటు తిరిగి ఢిల్లీలో పలుమార్లు కేంద్ర మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించి లేదని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కేంద్రం నిధులు ఇచ్చేలా లేదని విషయం ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తే వెంటనే రూ.24 కోట్లు మంజూరు చేశారన్నారు. బీజేపీ నాయకులు ప్రగల్భాలు పలకడం మానుకోవాలని సూచించారు. పనులు కొంత ఆలస్యమైన చివరి దశకు వచ్చాయని, ఈ నెల చివరి వరకు అన్ని పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెంటనే ప్రారంభోత్సవం చేసి వాహన దారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. వారి వెంట ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నర్సింగరావు, ఈఈ స్వామి, డీఈ సంధ్య, ఏఈ కౌషిక్, ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ అన్నపూర్ణ, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచ్ కొండ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

బస్టాండ్ పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

దేవరకద్ర బస్టాండ్‌ను కలెక్టర్ రవి నాయక్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం సందర్శించారు. అక్కడకి వచ్చిన ఆర్‌ఎమ్ శ్రీదేవి, డీఎమ్ సుజాతతో వారు మాట్లాడారు. బస్టాండ్‌లో నెలకొన్న సమస్యల గురించి ప్రజలు వారి దృష్టికి తెచ్చారు. బస్టాండ్ ముందు భాగంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడితే పలువురికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. అలాగే బస్టాండ్ వెనుక వైపు ఉన్న టాయిలెట్స్ వల్ల చుట్టు పక్కల నివాస ప్రాంతాల ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని తెలిపారు. వెంటనే సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని, ముఖ్యంగా మహిళలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. బస్టాండ్ శిథిలావస్థలో ఉందని వెంటనే మరమ్మతు చేయించాలని లేకుంటే కొత్తగా బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని కోరారు.

పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ హద్దులు గుర్తించాలి



మట్టి కుప్పలను చూపిస్తున్న మత్స్యకార్మిక సంఘం నాయకులు

మరికల్: మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులు గుర్తించాలని మత్స్య కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నారాయణ, శేఖర్, కొండప్ప అన్నారు. పెద్దచెరువులో అక్రమంగా వేసిన మట్టికుప్పలను గురువారం వారు పరిశీలించారు. మినీట్యాంక్ బండ్‌గా మార్చిన పెద్ద చెరువు పక్కన ఉన్న కొందరు రైతులు ప్రతియేటా మట్టివేసి పూడుస్తున్నారని, అలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. చెరువుల్లో నీటి నిల్వ కోసం తీస్తున్న గుంతల మట్టిని కూడా ఉపాధి కూలీలు వర్షపునీరు ముందుకు పోకుండా అడ్డుగా వేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు నీళ్లు రాకుండా అడ్డువేసిన మట్టిని వెంటనే తొలగిచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో మత్స్య కార్మికుల జీవితాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. అలాగే మరికల్ గ్రామానికి ప్రధాన నీటి వనరులుగా ఈ చెరువును కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో శేఖర్, సత్యన్న, రఘు, ఆంజనేయులు, పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి



మాట్లాడుతున్న బాలాజీ

నారాయణపేట రూరల్: ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను ప్రభుత్వం చొరువ తీసుకుని వేసవి సెలవుల్లో పూర్తి చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టు జూన్ 13కు వాయిదా వేయడంపై ప్రత్యేక వినతి ద్వారా ముందస్తుగా విచారణ చేయించి, ఇబ్బందులు తొలగించి పదోన్నతులు, బదిలీలు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ నెల 1వ తారీఖున జీతాలు అందేవిధంగా చర్యలు చేపట్టాలని, ఎస్‌టీఓ, డీటీఓలో బిల్లులు పాస్ కాకపోవడంతో టీచర్లు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భీమయ్య, గోవింద్, వెంకట్‌నాయక్ పాల్గొన్నారు.

బీసీల ఆశాజ్యోతి బీపీ మండల్



కోస్గిలో బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



నందిపాడ్‌లో..

కోస్గి: బీహార్ మాజీ ముఖ్యమంత్రి, జాతీయ బీసీ కమీషన్ మాజీ చైర్మన్ బిందేష్ ప్రసాద్ మండల్ బీసీల ఆశాజ్యోతి అని బీసీ సంఘ నాయకులు అన్నారు. ఈ మేరకు గురువారం మండల్ 41వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బీసీల అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నర్సిములు, బస్వరాజ్ యాదవ్, గంటల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నందిపాడ్‌లో..

మద్దూరు: బీపీ మండల్ వర్ధంతిని గురువారం మండలంలోని నందిపాడ్‌లో బీసీ సంఘం నాయకులు యాదగిరి, రాములు, రాంచందర్, బాలయ్య, గోపాల్, వెంకట్‌రాములు, చంద్రమౌళి, బాల్‌రాజ్ తదితరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం మొత్త పర్యటించి ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించిన గొప్ప నాయకుడు బీపీ మండల్ అని కొనియాడారు.

'కల్యాణలక్ష్మి' చెక్కుల అందజేత

మరికల్: మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేన్నారు. అలాగే ఎల్‌ఓసీ చెక్కులను అందజేశారు. కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద అదనంగా మరో తడి నీళ్లు వదిలితే పంటలు చేతికొచ్చే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, వైస్ ఎంపీపీ రవి, తహసీల్దార్ రాంకోటి, గోవర్ధన్, బసంత్, రామస్వామి, రాజవర్ధన్‌రెడ్డి, సంపత్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్, గోపాల్ పాల్గొన్నారు.

అంబలికేంద్రం ప్రారంభం



మక్తల్: మండలంలోని రామసముద్రం బసవేశ్వర దేవాలయం వద్ద గురువారం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నిర్వాహకులు బస్వరాజ్, వీరేశ్ ప్రారంభించారు. ఎండా కాలం దృష్ట్యా అంబలి పంపిణీ చేస్తునట్లు పేర్కొన్నారు.

బాటసారుల కోసమే చలివేంద్రం



నారాయణపేట రూరల్: మండలంలోని చిన్నజట్రంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా నారాయణపేట, హైదరాబాద్ ప్రధాన రహదారిపై వాహనదారులు, బాటసారుల దాహం తీర్చేందుకు గ్రామస్తుల ఆధ్వర్యంలో పంచాయతీ బిల్డింగ్ ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ రాములు ప్రారంభించారు. ఎండాకాలంలో పూర్తిగా చల్లటి తాగునీరు అందిస్తామని, ఇటు వెళ్లే వారు దాహంతో ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, ఉప సర్పంచ్ భానుప్రసాద్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు వేసవిలో చేపట్టాలి



ధన్వాడ: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వేసవి సెలవుల్లోనే చేపట్టాలని స్వేరో సర్కిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇబ్రహీంబాద్ లక్ష్మణ్ అన్నారు. గురువారం ధన్వాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీలు పదోన్నతుల ప్రక్రియ దాదాపు 30 నుంచి 40రోజుల వరకు కొనసాగుతుందని, పాఠశాలల పనిదినాల్లో చేపడితే విద్యార్థులకు నష్టం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, బాలరాజు, వెంకట్రాములు, రాజు, హన్మంతు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం ప్రారంభం



సిలిండర్ అందజేస్తున్న మేనేజర్ యువ వశిష్ట

మక్తల్: పట్టణంలో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని మేనేజర్ యువ వశిష్ట గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌దుకాణాల నుంచి 5 కేజీల గ్యాస్ సిలిండర్‌ను తక్కువ ధరలకే అందజేస్తామన్నారు. వినియోగదారులకు ఉచితంగా సిలిండర్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ సీతయ్య, జెడ్పీటీసీ వెంకటయ్య, హెచ్‌పీగ్యాస్ డీలర్ శాంతయ్య, రేషన్ డీలర్ అమరేందర్‌రెడ్డి, రామలింగం, కోరి మారెప్ప, రమేష్, చిన్నహన్మంతు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు ఆరోగ్యానికి హానికరం



అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ

నారాయణపేట రూరల్: మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని ఏఎస్‌ఐ ఎండీ ఆరీఫ్ అన్నారు. గురువారం మండలంలోని శ్యాసన్‌పల్లిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తుపదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అదేవిధంగా సైబర్ నేరాల వలలో పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహన డ్రైవింగ్ సమయంలో హెల్మెట్, సీట్‌బెల్టు ధరించాలని సూచించారు. విపత్తు నివారణ చట్టం అమలులో ఉన్నందున నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.వెయ్యి జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. నిత్యం యోగా, మెడిటేషన్, వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు కతలప్ప, సంతోష్, హన్మంతు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గొల్ల, కురుమల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



బీపీ మండల్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: గొల్ల, కురుమల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలో గల యాదవ కమ్యూనిటీహాల్‌లో బీపీ మండల్ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ లాలూ ప్రసాద్‌యాదవ్, అఖిలేష్‌యాదవ్ ముఖ్యమంత్రులుగా ఉన్నా కూడా ఆయా రాష్ట్రాల్లో సాధ్యం కాని ఉచిత గొర్రెల పంపిణీ పథకాన్ని రాష్ట్రంలో అమలు పరిచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న, వెంకటనర్సయ్యయాదవ్, శాంతయ్యయాదవ్, గణేష్, సాయిలుయాదవ్, రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటోంది

పాలమూరు: జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, త్వరలో ఉమ్మడి జిల్లాలోని జర్నలిస్టులందరికి ప్రత్యేక హెల్త్ క్యాంపు ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గురువారం ఉమ్మడి జిల్లాలో గుర్తింపు పొందిన మహిళా జర్నలిస్టులకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉమ్మడి జిల్లాలో 1,194 మంది జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు ఇస్తే ప్రస్తుతం 1,895 మందికి గుర్తింపు కార్డులు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కృష్ణ, సూపరింటెండెంట్ రామకిషన్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రెండు ఫంక్షన్‌హాల్‌లలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గురువారం ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరపున అధికారికంగా 'దావతే ఇఫ్తార్' విందు ఏర్పాటు చేశారు. ఇందులో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి, ఎంపీలు ఉపవాసం దీక్షల అనంతరం పలువురు ముస్లింకు పండ్లు తినిపించారు. మంత్రి మాట్లాడుతూ ఇఫ్తారు విందులు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఇఫ్తారు ఏర్పాటు చేసిందన్నారు. రంజాన్‌లో నిరుపేద ముస్లింలకు తోఫా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రహెమాన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అన్వర్ హుస్సేన్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ, బీఆర్‌ఎస్ నాయకులు హనీఫ్ అహ్మద్, షబ్బీర్, మోసిన్, మహమూద్‌అలీ సనా, అంజద్, సమద్‌ఖాన్, అర్షద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలి



గున్ముక్లలో ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

ధన్వాడ: మరికల్ మండలం చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన ధన్వాడ మండల కేంద్రంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని చక్రవర్తి అన్నారు. గురువారం మండలంలోని గున్ముక్ల, కంసాన్‌పల్లి, యంనోనిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇథనాల్ కంపెనీ నుంచి వెలువడే వ్యర్థ పదార్థాల వల్ల నీరు, గాలి, భూమి కలుషితం అవ్వడమే కాకుండా వ్యర్థాలు మన్నె వాగులో కలవడంతో భూగర్భ జలాలు, సాగు, తాగునీరు విషపూరితమై ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రాములు, రామచంద్రయ్య, మధు, మల్లేష్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ విద్యార్థినులకు సన్మానం



రెజ్లింగ్ విద్యార్థినులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ధన్వాడ: కస్తూర్బా గాంధీ పాఠశాలకు చెందిన రెజ్లింగ్ క్రీడాకారిణులు గీత, నాగలక్ష్మిని గురువారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఈనెల 11వ తేదీన ఉత్తరప్రదేశ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో 49కేజీల విభాగంలో గీత, 57కేజీల విభాగంలో నాగలక్ష్మి ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 16 నుంచి 18 వరకు జరిగే జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు వెళ్తున్న వారికి ట్రైన్ టికెట్, ఖర్చుల నగదును అందజేశారు. కార్యక్రమంలో కోచ్ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పైపులైన్ పనులకు భూమిపూజ



మరికల్: మండలంలోని ఎలిగండ్ల పెద్ద చెరువుకు కోయిల్‌సాగర్ కాల్వ నుంచి నీటిని తెచ్చేందుకు గురువారం పైపులైన్ పనులకు సర్పంచ్ దేవమ్మ భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే కేటాయించిన రూ.9లక్షల నిధులతో పైపులైన్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో కాయిల్‌సాగర్ కాల్వ నుంచి వచ్చే నీటిని పెద్ద చెరువులోకి మళ్లించేందుకు పైపులైన్ వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాశ్‌శెట్టి, తిరుపతయ్య, మోహన్, రవి, రాజవర్ధన్‌రెడ్డి, సూతారి రాములు, హన్మంతు, హుస్సేన్, వెంకటలక్ష్మారెడ్డి, భీంరెడ్డి, ఏలప్ప, వెంకటప్ప పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ విడుదల



అమరచింత: ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం ఆత్మకూర్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలను అరికడదాం – జాతీయ సంపదను పెంపొదిద్దాం అని పిలుపునిచ్చారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అగ్ని ప్రమాదాలను ఎలా అరికట్టాలనే విషయాలతో పాటు తమ సిబ్బంది ఎలా ప్రమాదాలను నివారిస్తారో అన్న విషయలను ప్రదర్శిస్తారని తెలిపారు. చుట్టు పక్కల ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఫైర్‌సిబ్బంది నరేష్‌గౌడ్, సందీప్‌రెడ్డి, నరసింహారెడ్డి, భానుచందర్‌రెడ్డి, వెంకటేశ్వర్ రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

చిన్నచింతకుంట: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఏదులాపూరంలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ హేమలత, ఎంపీటీసీ ఉషారాణి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవరకద్ర: పేదలకు అండగా ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రంజాన్ కానుకలను ముస్లింలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయంతో ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. తెలంగాణ వచ్చాకా అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారని బీజేపీ, కాంగ్రెస్ వారి మాయమాటలు నమ్మవద్దన్నారు. గతంలో ఏమి చేయని వారు ఇప్పుడు వచ్చి ఏమి చేస్తారని విమర్శించారు.

జోరుగా ఉపాధిహామీ పనులు



అమ్మపల్లిలో చెరువులో ఫిష్‌ఫండ్ పనులు చేపడుతున్న కూలీలు

మాగనూర్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు జోరుగా కొనసాగుతున్నాయి. గురువారం చెరువులో ఫిష్ ఫండ్‌లు, కాలువలు తవ్వడం, మట్టిని తొలగించడం తదితర పనులు చేశారు. వేసవికాలం సందర్భంగా ఉదయం 7 గంటల నుంచి 10:30 గంటల వరకు పనులు చేస్తునట్లు ఏపీఓ సత్యప్రకాష్ తెలిపారు.